నెల్లూరి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం | 20 అక్టోబర్ 2024 | పేజీలు 8

## పట్టణ డీఎస్పీని కలిసిన ఆనం




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి, వైసీపీ నాయకులు నెల్లూరు టౌన్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు.

## 22 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఏపీలో ఆధార్ ప్రత్యేక కాంపులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు ఇచ్చింది. గ్రామ, వార్డు వాలంటీర్, గ్రామ, వార్డు సచివాలయం డిపార్ట్మెంట్ వారు ఈ క్యాంపులను నిర్వహించాలని ఆదేశించింది. సచివాలయాలు, కాలేజీలు, స్కూల్స్, అంగన్వాడీ సెంటర్ తదితర వాటిల్లో ఈనెల 22 నుంచి 25 తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఆధార్ సేవా ప్రత్యేక క్యాంపులను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ట్రాక్టర్‌లలోనూ.. ఇసుక తీసుకెళ్లొచ్చు !



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుకపై సమీక్షించిన సీఎం చంద్రబాబు.. ఇసుక రీచ్‌ల నుంచి గతంలో ఎడ్లబండ్ల ద్వారా నే ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతి ఉండేది. ప్రస్తుతం రీచ్‌ల నుంచి ఎడ్లబండ్లతోపాటు ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లేందుకు అనుమ తిస్తూ ప్రభుత్వం ఇసుక విధానంలో మార్పులు తీసుకువచ్చింది. ప్రభుత్వం కూడా ఉత్తర్వులు జారీ చేశారు.

"ఆంధ్రప్రదేశ్ ఉచిత ఇసుక విధానంలో మార్పులు"

**జరిమానాలు ఉండవు..**

ఉచిత ఇసుకకు సంబంధించి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం సైతం తీసుకుంది. ఇసుకపై సీనరేజ్ వసూళ్లు కూడా ఎత్తి వేస్తున్నట్లు ప్రకటించారు. లారీల్లో 40 టన్నులకు మించి ఉన్నా అధిక లోడ్ జరిమానాలు ఉండవని సీఎం తెలిపారు. ఉచిత ఇసుకపై టీడీపీ ప్రజా ప్రతినిధుల భేటీలో ఈ మేరకు సీఎం కీలక ప్రకటన చేశారు.



"రీచ్‌ల నుంచి ఎడ్లబండ్లతోపాటు ట్రాక్టర్లలో కూడా ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతి"

-మిగతా 2లో

### లక్ష్మీనరసింహస్వామి దర్శించుకున్న
## మాజీ ఉప రాష్ట్రపతి సతీమణి ఉష



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రూరల్ మండలం నరసింహకొండలో వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వారిని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉష దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి తీర్ధ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు భాస్కరా చార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, అప్పలాచార్యులు, మురళీధరాచార్యులు, రాఘవాచార్యులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.


### దేవరపాలెం గ్రామంలో
## రెవెన్యూ సదస్సు

లోపల పేజీలో



### బెదిరింపుల ఎమ్మెల్యేలు, మంత్రులపై
## కేసులు నమోదు చేయాలి

- చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఆ పని చేయాలి
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్
- 25న వైసీపీ ఆధ్వర్యంలో ధర్నా



2లో

## విత్తన దుకాణాలు తనిఖీ



స్థానిక వర్షిత సీడ్స్, కావేరి సీడ్స్, ఇందిర సీడ్స్ తదితర వరి విత్తనాలు విక్రయించే దుకాణాలను వ్యవసాయ అధికారులు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

లోపల పేజీలో



## వింజమూరులో ముంచెత్తిన వాన

- నీట మునిగిన బీసీ కాలనీ, జీబీకేఆర్ ఎస్టీ కాలనీ..!
- దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి నివేదిక తయారు చేయండి
- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం
- చేనేత వస్త్రాల మగ్గాల గుంటలను పరిశీలిన
- అధైర్య పడకండి.. అండగా ఉంటా !
- ఎమ్మెల్యే కాకర్ల సురేష్

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావం రెండు రోజుల తరువాత శనివారం కుండపోత వర్షంతో వింజమూరు మండలాన్ని ముంచెత్తింది. దీంతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.

వివరాలు 02లో

### ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చడమే
## టీడీపీ లక్ష్యం : శాప్ చైర్మన్



లోపల పేజీలో

## పల్లెల్లో అభివృద్ధి సంబరాలు

- పల్లె పండుగ ద్వారా అభివృద్ధి ఫలాలు గ్రామ స్థాయికి..
- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



2లో

# బెదిరింపుల ఎమ్మెల్యేలు, మంత్రులపై కేసులు నమోదు చేయాలి

## మాజీ మంత్రి కాకాణి గోవర్థన్‌రెడ్డి డిమాండ్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇసుక, మద్యం విషయాల్లో జోక్యం చేసుకుంటే సహించనని చంద్రబాబు తన సొంత పార్టీ నేతలకు జారీ చేస్తున్న హెచ్చరికల్లో నిజంగా చిత్తుశుద్ధి ఉంటే, ఇప్పటి వరకు వివిధ జిల్లాల్లో బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలు, బ్లాక్‌మెయిల్ చేసిన ఎమ్మెల్యేలు, మంత్రులపై ఎందుకు కేసులు నమోదు చేయలేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఇసుక, మద్యం వివాదాల్లో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులపై కేసు నమోదు చేశారో, ఎంత మందిపై చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు మాటలకు అర్థాలే వేరు అన్న కాకాణి.. తమ పార్టీ వారెవ్వరూ ఇసుక, మద్యం జోలికి పోవద్దని చంద్రబాబు చెప్పాడంటే.. ఇష్టారాజ్యంగా దోచుకోమని వారికి చెప్పినట్లే అని స్పష్టం చేశారు. కూటమి ఈ నాలుగు నెలల పాలనంతా యథేచ్ఛగా దోచుకో తినుకో పంచుకో (డీపీటీ) అని మాజీ మంత్రి ఆక్షేపించారు. ఇసుక, మద్యం పాలసీల్లో అంతా గోల్‌మాల్ అనే ఆయన, ప్రభుత్వ మాటలకు, చేతులకు ఎక్కడా పొంతన లేదని, ఇసుక మొత్తం దోచుకున్నాక సీనరేజ్ రద్దు అని ప్రకటించారని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇసుక ధర వేలల్లో ఉండగా, సీనరేజ్ రద్దుతో కేవలం పదుల్లోనే ఊరట కలుగుతుందని తెలిపారు. ఇసుకలో రూ.800 కోట్ల ఆదాయానికి గండి కొట్టిన కూటమి నేతలు, ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడి చేశారన్నారు. నెల్లూరులోనూ కూటమి నేతల దందా కొనసాగుతోందన్న కాకాణి, స్థానిక సూరాయపాలెం ఇసుక రీచ్‌లో రూ.100 కోట్ల ఇసుక దోపిడీకి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్కెచ్ వేశారని ఆరోపించారు. జిల్లాలోని నాలుగు ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు టన్ను ఇసుకకు రూ.114.90 నిర్ణయిస్తే, రూ.36 కే చేస్తామని టెండర్లు వేయడం వెనుక రీచ్‌లను తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు చేసిన కుట్ర కాదా? అని నిలదీశారు. ఇసుక రీచ్‌లకు దాఖలైన టెండర్ల నుంచి లాటరీ ద్వారా కాంట్రాక్ట్ ఖరారు చేయాలన్న నిబంధనను మంత్రి నారాయణ ఒత్తిడి మేరకు కలెక్టర్ బేఖాతర్ చేస్తూ, ఎమ్మెల్యేల అనుచరులకు తిరిగి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటిపై ఈనెల 25న ధర్నా చేస్తున్నట్లు చెప్పారు.

# ట్రాక్టర్‌లోనూ ఇసుక తీసుకెళ్లొచ్చు

*(మొదటి పేజీ తరువాయి)*

**ఇసుక తవ్వకాలకు అనుమతులు..**

ఇటీవల పట్టా భూముల్లో కూడా ఇసుక తవ్వకాలకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. పట్టా భూములతో పాటు, డీకేటీ భూముల్లోనూ ఇసుక తవ్వకాలకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు సంబంధించిన గైడ్‌లైన్స్‌ను జారీ చేస్తూ కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే.

**అందుబాటులో కొత్త ఇసుక రీచ్‌లు :**

మరోవైపు కొత్తగా 108 ఇసుక రీచ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. నదుల్లో ఉధృతి దృష్ట్యా తొలి విడత వినియోగంలోకి 40 ఇసుక రీచ్‌లు తీసుకొస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. పట్టా భూముల్లో ఉన్న ఇసుక కూడా అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. జిల్లా కమిటీలు నిర్ణయించిన ధరకు పట్టా భూముల్లోని ఇసుక పొందవచ్చు. వీటితోపాటు నదీ తీర ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లుంటే అధికారులు గుర్తింపు ఇవ్వనున్నారు.

# పల్లెల్లో అభివృద్ధి సంబరాలు

- పల్లె పండుగ ద్వారా అభివృద్ధి ఫలాలు గ్రామ స్థాయికి..
- గ్రామాలకు మౌలిక వసతుల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదు
- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**విడవలూరు, మేజర్‌న్యూస్ :**

ఐదేళ్ల పాటు అభివృద్ధి ఆనవాళ్లే లేని పల్లెటూళ్లు పల్లె పండుగ కార్యక్రమంతో ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయనీ కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అన్నారు. విడవలూరు మండలంలోని ఇందిరానగర్ మరియు వావిళ్ళ గ్రామాలలో 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జోరు వానను సైతం లెక్క చేయకుండా జనం ఎదురేగి స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ.. రూ.82 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామన్నారు. అభివృద్ధి ఫలాలు గ్రామ స్థాయికి చేర్చాలన్న ఆశయంతో ప్రభుత్వం 'పల్లె పండుగ' కార్యక్రమానికి రూపకల్పన చేసిందన్నారు. ఓ వైపు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తూనే.. మరో వైపు గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రైన్లు లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. దశల వారీగా రానున్న ఐదేళ్లలో ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తానన్నారు. ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాల కారణంగా ఎక్కడైనా రోడ్లు, కాలువలకు గండ్లు పడి ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులలో అవసరమైతే వీపీఆర్ ఫౌండేషన్‌కు చెందిన ప్రొక్లైన్ వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. గత ఐదేళ్లుగా మౌలిక సదుపాయాల ఊసే లేని గ్రామాలలో దాదాపు రూ.4500 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 30 వేల అభివృద్ధి పనులు చేస్తున్న ఘనత చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి తొలి దశలో భాగస్వామ్యం దక్కని గ్రామాలను గుర్తించి మలిదశలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రాధాన్యతా క్రమంలో ఒకటి ముందు ఉండొచ్చు.. మరొకటి తరువాత ఉండొచ్చేమో కానీ, గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ఉచిత ఇసుక, సూపర్ సిక్స్, బాబు ష్యూరిటీ భవిషత్తు గ్యారంటీ లాంటి ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీ అమలు దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. దీపావళి నుండి అక్క చెల్లెమ్మలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో విడవలూరు తహసీల్దార్ కె.చంద్రశేఖర్, ఎంపీడీవో నగేష్ కుమారి, టీడీపీ మండల అధ్యక్షులు చెముకుల శ్రీనివాసులు, రాష్ట కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, టీడీపీ యువ నాయకులు వంశీకృష్ణారెడ్డి, మండల నాయకులు ఆవుల వాసు, టీడీపీ మండల ఇంచార్జ్ అడపాల శ్రీధర్ రెడ్డి, వావిళ్ళ ఎంపీటీసీ హరిరెడ్డి, జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి, శ్రీనాథ్ యాదవ్, చప్పిడి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.



# వింజమూరులో ముంచెత్తిన వాన

- నీట మునిగిన బీసీ కాలనీ, జీబీకేఆర్ ఎస్టీ కాలనీ..!
- ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కాలనీల పరిశీలన
- దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి నివేదిక తయారు చేయండి
- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం
- చేనేత వస్త్రాల మగ్గాల గుంటలను పరిశీలిన
- అధైర్య పడకండి.. అండగా ఉంటా : ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**వింజమూరు, మేజర్‌న్యూస్ :**

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావం రెండు రోజుల తరువాత శనివారం ఉదయం కుండపోత వర్షంతో వింజమూరు మండలాన్ని ముంచెత్తింది. దీంతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. చెరువులోనికి భారీగా వరద నీరు చేరింది. ఆ తర్వాత కూడా జల్లులు పడుతూనే ఉన్నాయి. కుండపోత వర్షానికి వింజమూరు పంచాయతీ పరిధి లోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. సుమారు వంద ఇళ్లల్లోకి నీరు చేరింది. మండల అధికారులు, పంచాయతీ అధికా రులు, మండల తెలుగుదేశం నాయకులు, సర్పంచ్ వర్షపు నీటిని బయటకు పంపించేందుకు తీవ్రంగా శ్రమించారు. జేసీబీల సహాయంతో కాలువలు తీసి యుద్ధ ప్రాతిపదికన నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్.. బీసీ కాలనీ, జీబీకేఆర్ ఎస్టీ కాలనీలలో స్వయంగా వరద నీటిలోనికి దిగి నీట మునిగిన ఇళ్లను, మగ్గాలను ప్రవాహాన్ని స్వయంగా తమ ఫోన్‌లో ఫోటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించారు. జిల్లా అధికారులతో స్వయంగా చరవాణి ద్వారా మాట్లాడారు. మహిళలతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

నీట మునిగిన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి అధైర్య పడకండి.. అండగా ఉంటానని, వారికి ధైర్యాన్నిచ్చారు. వర్షపు నీటిని బయటకు పంపించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అక్కడకు వచ్చిన అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలోని సీతారాంపురంలో కోతకు వచ్చిన వరి పంట నేలమట్టమై దెబ్బతిందని, అంతకు మించి పెద్దగా నష్టం జరగలేదన్నారు. శనివారం ఉదయం కురిసిన వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలలో ఇల్లు నీట మునిగాయని, వాటన్నిటిని కూడా పరిశీలించామన్నారు. వర్షం కురుస్తున్నందున అధికారులు పర్యవేక్షిస్తూనే ఉండాలని తెలిపారు. వింజమూరులోని బీసీ కాలనీలో సుమారు 120 ఇల్లు నీట మునిగినట్లు అంచనా వేశారు. వాటిని మూడు దశలుగా నివేదిక తయారు చేయాలని అధికారులకు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. నష్టపరిహారం అందించేందుకు, కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం పునరావాస కేంద్రాలలో ఆహారం అందించడంతోపాటు వారికి అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కనుక ప్రజల కూడా అప్రమత్తంగా ఉండి.. ఏమైనా ఇబ్బందులుంటే మండల అధికారులకు తెలియజేయాలని ప్రజలకు తెలియజేశారు.

ఎమ్మెల్యేతో పాటు మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జూపల్లి రాజారావు, నీలం పెరుమాళ్ళ సర్పంచ్ సృజన, ఎంపీటీసీ సభ్యురాలు యాకసిరి భవాని వాణి, తెలుగుదేశం నాయకురాలు జయలక్ష్మి, తహసిల్దార్ ఎస్ఎం హమీద్, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివ ప్రసాద్, ఇరిగేషన్ డీఈ రమణారావు, ఏఈ మహేంద్ర, ఇతర కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# భారీవర్షాలతో జలవనరుల నష్టాల అంచనాలు సిద్ధం

**-100కోట్లతో పోర్లుకట్టల శాశ్వతపనుల అంచనాలు**

**- 3కోట్లతో తాత్కాలిక ప్రతిపాదనలు : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు డివిజన్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలవనరుల శాఖకు చెందిన నష్టాలను పరిశీలించి అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామని స్థానిక ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రావూరు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో తమ డివిజన్‌లో ఐదురోజుల పాటు భారీ వర్షాలు కురిశాయని, ఆసమయంలో అన్ని మండలాల్లో తాను, తమ సిబ్బంది ముమ్మరంగా పర్యటించి పరిశీలించామని, వర్షాలు తగ్గిన అనంతరం రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలమేరకు నష్టాలను అంచనా వేసి తాత్కాలిక మరమ్మత్తులకు 50లక్షల రూపాయలతో, పోర్లుకట్టల శాశ్వత మరమ్మత్తులకు 100కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆయన తెలిపారు. పెన్నానదీ పరీవాహక ప్రాంతంలోని వరికుంటపాడు నుండి వీర్లగుడిపాడు వరకు పోర్లుకట్టలు దెబ్బతిన్నాయని, అనేక చెరువుల తూములు దెబ్బతిన్నాయని ఆయన వివరించారు. ఏఎస్‌పేట మండలంలోని చిరమన చెరువుకు చెందిన 2తూములు, పొనుగోడు, గుంపర్లపాడు, చౌటభీమవరం చెరువుల తూములు దెబ్బతిన్నాయని, అనంతసాగరం మండలంలోని అనంత సాగరం, కొత్తపల్లి చెరువుల తూములు దెబ్బతిన్నాయని, చేజర్ల మండలం పాడేరు చెరువు తూము దెబ్బతిన్నదని, ఉదయగిరి మండలం గండిపాళెం ప్రాజెక్టు కుడి, ఎడమ మెయిన్ కాలువల గేట్లు దెబ్బతిన్నాయని, ఎడమకాలువ 4, 5 డిస్ట్రిబ్యూటరీల గోడలు దెబ్బతిన్నాయని, అక్విడెట్ గోడ, కుడికాలువ గోడలు పడిపోయాయయని, సీతమ్మకుంట చెరువు షట్టర్ దెబ్బతిన్నదని ఆయన వివరించారు. మొత్తం 24పనులకు 3కోట్ల రూపాయలతో, పెన్నాపోర్లుకట్టల శాశ్వత మరమ్మత్తులకు 100కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపామని, నిధులు విడుదలయ్యాక పనులు చేపడతామని ఈఈ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చేజర్ల మండలం నల్లవాగు కాజ్‌వే వద్ద పూడికతీతపనులు, జనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ఈకాజ్‌వే ఎత్తుపెంచేలా చర్యలు తీసుకుంటామని ఈఈ పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి : ఎస్ఐ




**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణపై జలదంకి ఎస్ఐ లతీఫున్నీసా ప్రత్యేక దృష్టి సారించారు. మండలంలోని పలు రోడ్లపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి నివారణ చర్యలు ప్రారంభించారు. ఆయా ప్రాంతాలలో వాహనాలు వేగంగా వస్తూ రోడ్డు దాటే వ్యక్తులను, వాహనచోదకులను ఢీ కొటుతుం డటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనాల వేగం అదుపు చేసేందుకు స్టాపర్ బోర్డులు ఏర్పాటుచేశారు. ఇక తరచూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహనాల తనిఖీలు కూడా పోలీసులు చేపడుతున్నారు. కావలి - ఉదయగిరి జాతీయ రహదారిలో, మండలంలోని పలు రోడ్డులలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి స్టాపర్ బోర్డులు ఏర్పాటుచేశామని వాహనచోదకులు హెచ్చరిక బోర్డులు ఉన్నచోట నిదానంగా ప్రయాణించాలని ఎస్ఐ కోరారు. రోడ్డు దాటే వాహన చోదకులు, పశువుల కాపరులు, పాదచారులు రోడ్డు నియమాలను పాటించటంతో పాటు వాహనాల రాకపోకలను గమనిస్తూ రోడ్డు దాటాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి వాహ నాలు నడిపే వారిపై అపరాధ రుసుం విధిస్తున్నామని వాహనచోదకులు ఖచ్చితంగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. వాహనదారులు మితిమీరి వేగంతో ప్రయాణించకుండా సురక్షితంగా డ్రైవింగ్ చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

# మండల సర్వసభ్య సమావేశం



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం ఉమ్మడి నెల్లూరు జిల్లా సైదాపురం మండలం ప్రజా పరిషత్ కార్యాలయం నందు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సైదాపురం మండలం అన్ని శాఖల అధికారులు, సైదాపురం మండల నాయకులు హాజరై అన్ని శాఖల అధికారులతో రివ్యూలు చేశారు. ఈ సమావేశంలో సైదాపురం ఎంపీడీవో పురుషోత్తమ శివకుమార్ మాట్లాడుతూ.. సైదాపురం మండలంలో 74 లక్షలు 15వ ఆర్థిక సంవత్సరానికి, 87 లక్షలు జనరల్ ఫండ్, మొత్తం ఒక కోటి 65 లక్షలు ఉంది. 15వ ఫైనాన్సులో 40 శాతం అన్ టైట్ గ్రాండ్ దీంతో గోడలు గాని, నిర్మాణాలు గానీ చేసుకోవచ్చని, 35 శాతం తాగునీటికి ఖర్చు పెట్టుకోవాలని, మిగిలిన పారిశుద్ధ్య పనులకుఖర్చు చేసుకోవాలని, జనరల్ ఫండ్‌లో పాఠశాల భవన నిర్మాణాలు, ప్రహరీ గోడలు, స్మశాన అభివృద్ధి పనులు, ఎఫ్‌డబ్ల్యూసి సిమెల్లు నిర్మాణాలు గానీ చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం మండల విద్యుత్ శాఖ అధికారి జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 1 వాట్ నుంచి 3 వాట్ కరెంటు మిగులు గృహ వినియోగదారులకు 30వేల నుంచి 60వేల సబ్సిడీ వస్తుందని, వినియోగదారులు సోలార్ ప్యానల్ బిగిచ్చుకుంటే వారికి యూనిట్లనేటివి కరెంటుబిల్లు తగ్గుతుంది, కేంద్ర ప్రభుత్వం ద్వారా గ్రామాల పొలాలకు 24 గంటలు కరెంటు సరఫరా కొన్ని అనివార్య కారణాలవల్ల చేయలేకపోతున్నాను, సోలార్ సబ్సిడీ 30వేల నుంచి 60వేల వరకు వస్తుందని సోలార్ సబ్సిడీ ఎలా దరఖాస్తు చేసుకోవాలో సైదాపురం విద్యుత్ శాఖ కేంద్రాన్ని సంప్రదిస్తే అన్ని వివరాలు తెలుపుతామని ఆయన తెలిపారు. ఈ యొక్క సమావేశానికి మండల అధ్యక్షులు కట్ట మోహన్ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, రాజశేఖర్ రాజు, దిలీప్ చౌదరి, మాజీ ఎంపీపీ రమణా రెడ్డి, జడ్పిటిసి పోలయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేని ప్రజలు సద్వినియోగం చేసుకోండి

**బోగోలు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో రీ సర్వే పూర్తి కాబడిన ప్రతి గ్రామం నందు ఏర్పాటు చేయనున్న గ్రామ సభలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు రెవిన్యూ సదస్సులు నిర్వహించవలసినదిగా అధికారులను ఆదేశించారు. మండలంలోని గ్రామాలలో షెడ్యూల్ ప్రకారం తహసిల్దారు, మండల సర్వేయర్, మండల రెవెన్యూ ఇన్‌ఫెక్టర్ సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి, దేవాదాయ శాఖ, వర్క్ బోర్డు ప్రతినిధులు, రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ నుండి ప్రతినిధి, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు, గ్రామ సర్వేయర్ వారు హాజరై గ్రామంలో రెవెన్యూ సంబంధిత సమస్యలు 22-ఏ, చుక్కల భూములు, పోషణల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మార్చటం, అసైన్డ్ భూములను మరియు ఆలీనేటెడ్ భూములు, ఖాతా నెంబర్లకు ఆధార్ నమోదు, రీ సర్వే రైతు సేవలో రెవిన్యూ శాఖ కార్యక్రమం విజయవంతం చేయవలెనని ఆదేశించారు. సంబంధిత అంశాలను స్వీకరించి సమస్యలకు పరిష్కారం చూపుతూ గ్రామ సభలను షెడ్యూల్ వారీగా సంబంధిత అధికారులు గ్రామాలకు హాజరుకావాలని అధికారులు ఆదేశించారు. సభలు నిర్వహించి తేదీలు 19వ తేదీన సాంబశివపురం గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో గ్రామసభ. అక్టోడర్ 23వ తేదీ మంగమూరు గ్రామంలోని గ్రామ సచివాలయంలో, అక్టోడర్ 25వ తేదీ ఎస్సీ పాలెం గ్రామ సచివాలయం, అక్టోడర్ 29వ తేదీ జక్కపల్లి గూడూరు గ్రామ సచివాలయం, నవంబర్ 5వ తేదీ ఉమా మహేశ్వరపురం, గ్రామపంచాయతీ కార్యాలయం, నవంబర్ 7వ తేదీ తాళ్లూరు గ్రామ సచివాలయం, నవంబర్ 8వ తేదీ మల్లయపాలెం రైతు సేవా కేంద్రం నందు పైన తెలిపిన తేదీలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల తహసిల్దార్ సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కప్పల దరువులో పల్లె పండుగ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండలం తాళ్లపూడి పంచాయతీ కప్పల దరువు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మల్లె పండుగ వాతావరణం కనిపించింది. శనివారం ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శంకుస్థాపన కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి గ్రామ సర్పంచ్ మెట్ట వింధ్య రెడ్డి టిడిపి నాయకులు వేణుంబాక శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి తులసి ఫీల్డ్ అసిస్టెంట్ పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## దేవరపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని దేవరపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రెవెన్యూ శాఖలో ఆన్‌లైన్ ట్యాంపరింగ్, రికార్డుల తారుమారుపై అధికారులు గ్రామస్థాయిలో ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారు అని తెలియజేశారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రెవెన్యూ పరంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామస్థాయిలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో రెవెన్యూ అధికారులు పాల్గొని, సమస్యలకు పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, దేవరపాలెం ఉపసర్పంచ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, టీడీపీ నాయకులు కుర్ర శ్రీనివాసులు రెడ్డి, ముత్యంశెట్టి శీనయ్య, తాటిపర్తి బాబు, వెంకటేష్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీజన్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించండి



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** వాతావరణ మార్పుల వలన గ్రామాలలో సీజనల్ వ్యాధులు రాకుండా వైద్య శాఖ అధికారులు, సర్పంచులు, మున్సిపాలిటీ, సెక్రటరీలు ప్రత్యేక దృష్టి వహించి విధులు నిర్వహించాలని ఎంపీడీవో వేణుగోపాల రావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రమైన తూర్పు చెన్నం పల్లి, తూర్పు బోయమడుగుల, గువ్వాడి గ్రామా పంచాయతీలలో సీజన్ వ్యాధులపై కళా ప్రదర్శన కార్యక్రమం ఎంపీడీవో వేణుగోపాలరావు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ ప్రజలకు డయేరియా, మలేరియా, డెంగు, పర్యా వరణ పరిరక్షణ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గురించి నాటిక జానపద గేయాల ద్వారా చైతన్య జానపద కళాబృందం ద్వారా పి.శ్యామల దేవి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వేణు గోపాల రావు మాట్లాడుతూ.. ప్రజలు నివాస ప్రాంతాల చుట్టుపక్కల మురుగునీరు నిల్వకుం డా, పిచ్చిమొక్కలు పెరగకుండా చూసుకోవాలని, కాచి వడగట్టిన గోరువెచ్చని నీటిని తాగడం, ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాల కుండా తగు జాగ్రత్తలు పాటించాలని గ్రామ స్థులకు సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్రామాల్లో శానిటైజేషన్ ఎప్పటికప్పుడు చేస్తూ ఉండాలని అధికారులకు తెలియజేశారు. ప్రజలు అనారోగ్య బారిన పడకుండా చర్యలు చేపట్టాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఈవోపీ ఆర్డి నాగూర్ వలి, వీఆర్వోలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పొట్టేపాళెం గ్రామంలో పల్లె పండగ కార్యక్రమం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పొట్టేపాళెం గ్రామం లో పల్లె పండగ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొట్టేపాలెం గ్రామంలో 20లక్షల రూపాయల నిధులతో కమ్యూనిటీ షెల్టర్ల పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ పిలుపుమేరకు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వారం రోజులపాటు పల్లె పండగ కార్యక్రమం ఉంటుంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామాల్లో 2కోట్ల రూపాయల నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తామని తెలియజేశారు. నెల్లూరు రూరల్ నియోజవర్గ అభివృద్దే లక్ష్యంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పనిచేస్తున్నారని కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో నెల్లూరు రూరల్ నియోజకవర్గం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయటమే మా జెండా – అజెండా అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నాయకులు ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, ఇందుపూరు ఉదయ్ రెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్ కుమార్ యాదవ్, నెల్లూరు రూరల్ మండలం ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వి.శైలేంద్ర కుమార్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ అల్లా భక్షు, సర్పంచ్ ఏడుకొండలు, ఎంపీటీసీ నేరెళ్ళ నారాయణ, పంచాయతీ రాజ్ ఈఈ సుబ్బరాజు, పొన్నాల రామచంద్రా రెడ్డి, హరి యాదవ్, జనని బాబు, సురేష్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సుబ్రమణ్యం, బాలకృష్ణ, పెంచలయ్య, ఫిరోజ్, నరసయ్య, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విపరీతంగా సిమెంట్ ఇటుకబట్టీలకు ఇసుక అక్రమ రవాణా

## పట్టించుకోని అధికారులు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండ లంలో సిమెంటు ఇటుకబట్టీలకు పలువురు అక్రమంగా బొగ్గేరునుండి ఇసుకను విపరీతంగా తరలిస్తుండగా అధికారులు ఏమాత్రం పట్టించు కోవడం లేదు. శనివారం దేపూరువద్ద ఒక సిమెంటు ఇటుకల తయారీ కేంద్రానికి బొగ్గేరు నుండి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించ సాగారు. ఈవిషయమై కొందరు అధికారులకు సమాచారమిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మేజర్‌న్యూస్ పరిశీలించగా ట్రాక్టర్‌తో ముమ్మ రంగా ఇటుకల తయారీ కేంద్రానికి తరలించడం కన్పించింది. అదే ట్రాక్టర్ బొగ్గేరులో ఇసుకను లోడ్ చేస్తుండగా ఆట్రాక్టర్ కలిగిన వ్యక్తి ఇదితన స్వంతానికని, ఇటుకల కేంద్రానికి కాదంటూ బుకాయించ సాగాడు. కాగా పలువురు గ్రామ స్థులు మేజర్‌న్యూస్‌తో మాట్లాడు తూ.. ఇసుకను ముగ్గురు వ్యక్తులు తమ సిమెంటు ఇటుకల కేంద్రానికే కాకుండా ఇతరుల కేంద్రాలకు కూడా తోలుతూ ఎలాంటి అనమతులు లేకుండా యధావిధిగా వ్యవహారం సాగిస్తున్నారని, ఈ విషయమై పోలీసులకు సమాచారమివ్వగా వారు ఆ ఇటుకల కేంద్రాన్ని పరిశీలించి ట్రాక్టర్‌ను సీజ్‌చేయ కుండానే ఇసుకల తోలరాదని చెప్పి వెళ్ళారు. కానీ వారు మాత్రం ఖాతరు చేయకుండా ఇసుకను తరలించసాగారు. మొన్నటి దాకా ఇసుకను స్వంతానికి తోలుకుంటున్నవారి ట్రాక్టర్‌లను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించి కేసులు కూడా నమోదు చేసి తాము కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పసాగారని, తీరా ఎద్దులబండ్లు, ట్రాక్టర్లలో వ్యాపారపరంగా సిమెంటు ఇటుకల తయారీకి బొగ్గేరు నుండి తరలిస్తుండగా చూసీచూడనట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. స్వంత నిర్మాణాల అవసరాలకు ఇసుకను తరలించే సాధారణ ప్రజలకు ఒక చట్టం, ఇటుకబట్టీలకు తరలించే వ్యాపారులకు ఒక చట్టమా అని వారు ప్రశ్నించారు. మరి ఇప్పటికైనా స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.



# రాష్ట్ర అధికార ప్రతినిధిగా ప్రసన్న



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైసీపీ ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గతంలో కోవూరు ఎమ్మెల్యేగా జిల్లా వైసీపీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డికి ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధి బాధ్యతలు ఇవ్వడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పదవి పార్టీ బలోపేతానికి తనపై మరింత బాధ్యతను పెంచిందని గుర్తు చేశారు.

# రీ సర్వేలో తప్పులు సవరణకు గ్రామసభలు




**విడవలూరు, మేజర్‌న్యూస్ :** గత ప్రభుత్వంలో జగనన్న భూ రక్ష పథకం ద్వారా రి సర్వే నిర్వహించగా వాటిలో తప్పులను సవరించేందుకు ఈ ప్రభుత్వ హయాంలో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని గాదెలదిన్నె సచివాలయంలో శనివారం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వే కార్యక్రమంలో భాగంగా చాలామంది రైతులకు తప్పులు దొర్లినట్టు ప్రస్తుత ప్రభుత్వం గుర్తించింది అని తెలిపారు. అలాంటి రైతులకు నష్టం వాటిల్లకుండా తిరిగి గ్రామసభలు నిర్వహించమని ఆదేశించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే గ్రామ సభలు నిర్వహించి తప్పులను సవరించడం జరుగుతుందని తెలిపారు. ఈ గ్రామ సభ ద్వారా ఏడు అర్జీలు రైతులు ద్వారా వచ్చాయని వాటికి పరిష్కారం చూపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ భక్తవత్సలయ, డిప్యూటీ తహసిల్దార్ విజయ్, విఆర్ఓ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోండి : ఆర్డీవో ఎస్ వంశీకృష్ణ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఆర్డిఓ ఎస్.వంశీ కృష్ణ తన కార్యాలయంలో శనివారం పాత్రికే యుల సమావేశం నిర్వహించి జరుగుతున్న రెవెన్యూ సదస్సు గురించి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ సమయంలో భూ సర్వే రాష్ట్ర మొత్తం మీద 75శాతం పూర్తయిందని, ఈ 75శాతంలో కావలి రెవెన్యూ డివిజన్ పరిధిలో అక్టోబర్ 19 నుండి నవంబర్ 14 వరకు ఈ రెవెన్యూ సదస్సు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తారని రీ సర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించినప్పుడు ఆ రీసర్వేలో ఏమైనా పొరపాట్లు దొర్లి ఉంటే సూక్ష్మంగా ఉంటే అదే రోజు సమస్యను పరిష్కరిస్తామని అలాగే సమస్య ఏదైనా పెద్దదైతే ఫిర్యాదు దాడులు అర్జీ ఇచ్చిన రోజు నుండి 15 రోజులు లోపల ఆ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులో రెవెన్యూ జిల్లా అధికారి, ఎమ్మార్వో, ఇతర సిబ్బంది కూడా ఉంటారని, ఈ అవకాశం ప్రతి గ్రామస్తులు కూడా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మార్వో శ్రావణ్ కుమార్ రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత ఐటీఐలో ప్రవేశానికి ఆహ్వానం

**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** ఉచిత ఐటీఐ విద్యతోపాటు హాస్టల్ వసతి కల్పించబడునని ఎస్ఆర్ఆర్ఎం ఐటీఐ కరస్పాండెంట్ ఎస్ఏ.రహిమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 అక్కడమిక్ విద్యా సంవత్సరానికి ఎలక్ట్రీషియన్ ట్విట్టర్ ట్రేడ్లలో అడ్మిషన్ల కొరకు అక్టోబర్ 25 వరకు గడువు ఉందని, ఐటీఐలో చేరదలచిన విద్యార్థులు అభ్యర్థులు దరఖాస్తులను పొదలకూరు రోడ్డు ఎస్ఆర్ఆర్ఎం ఐటీఐ కళాశాలలో సంప్రదించవలసిందిగా 9703967967 నెంబర్‌లో సంప్రదించాలని కరస్పాండెంట్ రహమాన్ కోరారు.

# అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రధానం




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ, చిత్ర లేఖనలో గెలుపొందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతోపాటు ప్రశంసా పత్రాల బహూకరణ కార్యక్రమ జరిగింది. ఈ సంధర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డా.ఎం.పెంచలయ్య మాట్లాడుతూ.. ప్రతి విధ్యార్థి ఒక ఉన్నతమైన లక్ష్యమును నిర్ణయించుకొని, దానిని సాదించడానికి ప్రణాళిక భద్ధముగా కృషి చేయాలని విద్యార్ధులకు మార్గనిర్ధేశం చేశారు. జిల్లా విధ్యాశాఖాధికారి పివిజె రామారావు మాట్లాడుతూ.. విధ్యార్ధులకు విద్య ఎంత ప్రాముఖ్యమో పాఠ్యేతర కార్యక్రమాలలో కూడా చురుకుగా పాల్గొనడం ప్రతి విద్యార్థికి వారి ఉన్నత ఎదుగుదలకు ఎంతో అవసరమని తెలియజేశారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డా. షేక్.ఖాదర్‌వలి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్ధి క్రమశిక్షణతో మెలగాలని అది వారి జీవితానికి బంగారు బాట వేస్తుందని తెలియజేశారు. తదుపరి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డా. ఎం.పెంచలయ్య, జిల్లా విధ్యాశాఖాధికారి పివిజె రామారావు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డా. షేక్. ఖాదర్‌వలి చేతులమీదుగా నగదు ప్రోత్సాహకంతోపాటు ప్రశంసాపత్రాలు బహూకరించారు. వ్యాసరచనలో మొదటి బహుమతి ఎస్.శ్రీవిద్య హన్సిక, మూలాపేట, నెల్లూరు ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాల రూ.5వేలు, రెండవ బహుమతి షేక్. అఫ్రిద్, దర్గామిట్ట, నెల్లూరు డీసీఆర్ జడ్పీహెచ్‌ఎస్ రూ.3వేలు, మూడవ బహుమతి వి.సుచిత్ర జడ్పీహెచ్‌ఎస్, గంగపట్నం, కొడవలూరు మండలం రూ.2వేలు, వకృత్వంలో మొదటి బహుమతి పి.భవ్యశ్రీ జడ్పీహెచ్‌ఎస్, బుచ్చిరెడ్డిపాళెం రూ.5వేలు, రెండవ బహుమతి బి.లాలస జడ్పీహెచ్‌ఎస్, చెన్నపల్లిపాలెం, టిపి గూడూరు రూ.3వేలు, మూడవ బహుమతి బి.వర్షిణిప్రియ జడ్పీహెచ్‌ఎస్, నేకునంపేట, కొండాపురం రూ.2వేలు, చిత్రలేఖనంలో మొదటి బహుమతి ఎం.గౌతమి డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకులం రామచంద్రపురం, బుచ్చిరెడ్డిపాళెం రూ.5వేలు, రెండవ బహుమతి వి. శివాని జడ్పీహెచ్‌ఎస్ గండవరం, కొడవలూరు రూ.3వేలు, మూడవ బహుమతి బి. సురేంద్ర జడ్పీహెచ్‌ఎస్ చెముదుగుంట, వెంకటాచలం రూ.2వేలు గెలుపొందినారు. ఈ కార్యక్రమంలో డా. ఏ.ఉమామహేశ్వరి, డిఐఓ డా. పిఎల్ దయాకర్, ఎఫ్‌పిసి నోడల్ ఆఫీసర్ కె.కనకరత్నం, డెమో డి.కరుణాకర్‌రెడ్డి, డిఎస్‌ఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హైరిస్క్ గర్భవతులకు పరీక్షలు : డాక్టర్ కావ్య



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** గర్భవతులందరూ వైద్యపరంగా ఏ అవసరం వచ్చినా ఏ టైంలో నైనా ఆశా కార్యకర్తకు గాని సంబంధిత ఆరోగ్య సహాయకులకు గాని వెంటనే ఫోన్ చేస్తే మీకు అందుబాటులో ఉండి తగు సూచనలు సలహాలు ఇస్తారని తెలియజేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనానికి ఫోన్ చేసి పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందవచ్చునని తెలియజేశారు. ప్రజలందరూ వర్షాలు పడ్డన్న కారణంగా కాచి చల్లార్చిన నీటిని, వేడి వేడి ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలని, ఆహారం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కొని ఆహారం భుజించాలని, ప్రజలందరూ దోమల కొట్టకుండా ఉండేందుకు దోమతెరలు ఉపయోగించాలని మీ చుట్టుపక్కల నీరు నిల్వ ఉన్నాడుగా మడ్డి ఆయిల్ ను వేసిన యెడల దోమలు లార్వా దశలోనే చనిపోవడం జరుగుతుందని తద్వారా చికెన్ గునియా, డెంగ్యూ, లాంటి దోమకాటు వ్యాధులు రాకుండా నివారించుకోవచ్చునని ప్రజలందరికీ తెలియజేశారు. ఈ హౌస్ టు హౌస్ విజిట్‌లో ఆరోగ్య సహాయకులు ఎం.రాధా కుమారి, సాని శివ ప్రసాద్, ఆశ కార్యకర్తలు సీత, లక్ష్మి పాల్గొన్నారు.

# డీబీఎస్ కళాశాలలో పీసీబీ డిజైన్ వర్క్ షాప్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక మద్దూరుపాడులో ఉన్న డీబీఎస్ కళాశాలలో గత రెండు రోజుల నుండి వర్క్ షాప్ ద్వారా విద్యార్థులకు పీసీబీ డిజైన్ వర్క్‌ను నిర్వహిస్తున్నారు. ఈ వర్క్ షాప్ ద్వారా విద్యార్థుల సృజనాత్మకతరం పెంపొందిస్తుందని తిరుపతికి చెందిన పద్మావతి సొల్యూషన్ ప్రతినిధి యోగానంద తెలిపారు. శనివారం డీబీఎస్ కళాశాలలో పీసీబీ డిజైన్ వర్క్ షాప్‌లో విద్యార్థులకు పీసీబీ డిజైన్ గురించి ఒక్క రోజు ఆన్‌లైన్ క్లాసులు మరొక రోజు ఆఫ్‌లైన్ క్లాసుల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొబైల్ ఫోను టీవీ లాంటి ఎలక్ట్రిక్ వస్తువులలో ఉపయోగించే ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు తయారీ గురించి ఈసీఈ విభాగ విద్యార్థులకు ఈ రెండు రోజులు వర్క్ షాప్‌లో అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. అలాగే డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దాంశెట్టి సుధీర్ నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి అవసరమైన అన్ని శిక్షణ ఇప్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థి ఉపయోగించుకొని నైపుణ్యాలను వృద్ధిపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ రావు పరిపాలన అధికారి జి.రమేష్ బాబు, ఈసీఈ విభాగ అధిపతి కే.వేణుగోపాల్, అధ్యాపకులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

- సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి కోర్టు ప్రాంగణంలో హైకోర్టు సూచనలు మేరకు ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛభారత్‌లో భాగంగా కోర్టు పరిసర ప్రాంతాలను శుభ్రం పరుస్తున్నారు. అదే క్రమంలో న్యాయమూర్తులు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి పరిసర ప్రాంతాలను పచ్చదనంతో చెట్లను నాటడం అక్కడ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్జీలతో కలిసి న్యాయవాదులు స్వచ్ఛభారత్‌లో పాల్గొన్నారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ.సుధాకర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.విక్రమ్ సింహ స్పెషల్ మెజిస్ట్రేట్ వి.పరుశురాం మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్నామని పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యం వంతులుగా ఉంటారని కాబట్టి మన చుట్టూ పరిసర ప్రాంతాలను శుభ్రపరచుకొని, పచ్చని చెట్లు నాటి మంచి వాతావరణాల్లో ప్రజలు జీవించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, లీగల్ ఎయిడెమెంబర్ ఐ.సాయి ప్రసాద్, లోకదాల మెంబర్ ఎం.మాలకొండ రెడ్డి, ఇతర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్పత్తులు నమోదుపై శిక్షణ కార్యక్రమం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని డిఆర్డిఏ కార్యాలయంలోని శనివారం డైరెక్ట్ మార్కెటింగ్‌తోపాటు డిజిటల్ మార్కెటింగ్లో ఏపీఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఆర్డిఆర్పిడి నాగరాజు కుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్‌జీహెచ్ మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులు డైరెక్ట్ మార్కెటింగ్‌తోపాటుగా డిజిటల్ మార్కెటింగ్‌లో కూడా అమ్మకాలు జరుపుతూ వారి ఆదాయం పెంపొందించు కొనే విధంగా చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ కేంద్రంగా మైస్టోర్ ద్వారా ఓయాన్ డీసీ వేదికగా ఉత్పత్తులు నమోదు చేసుకొనుటకు అందరూ ఏసీ ఏపీయం కొంతమంది సీసీలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణలోనే ఆహార ఉత్పత్తులు తయారు చేసే వారు ఖచ్చితముగా తీసుకోవలసిన ఫస్సి సర్టిఫికేట్ ఏ విధంగా తీసుకోవాలో వివరించారు. సర్ప్ నుండి ఓఎన్డిసిసికి నెల్లూరు జిల్లాకు 1200 ప్రొడక్ట్సను మై స్టోర్‌లో ఆన్ బోర్డు చేసే విధంగా టార్గెట్ ఇచ్చారు కాబట్టి జిల్లాలో వున్న ప్రతి వివోకు కనీసం ఒకటి చేయాలని, దానికి అనుగుణముగా బ్యాంకు లింకేజి, స్త్రీనిధి, వున్నతిల నుండి ఆర్థికంగా చేయూత కల్పిస్తూ టార్గెట్ పూర్తి చేయాలి అని తెలిపారు. ఏసిలు, ఏపిఎంలు బ్యాంకు లింకేజి, స్త్రీనిధి, వున్నతి రుణాలు రికవరీ కూడా భాగా ఉండేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశానికి ఏసిలు, ఏపిఎంలు కొంతమంది సీసీలు, కార్యాలయ సిబ్బంది, ఏపిడి రాజు, వెంకటేశ్వర్లు, ఆహార ఉత్పత్తుల తనిఖీ శాఖ హెడ్ హాజరయ్యారు.

# జిల్లా కార్యాలయంలో జనవాణి కార్యక్రమం

**నెల్లూరు/నవాబుపేట, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కార్యాలయం, గోమతి నగర్ నందు గత మూడు వారాలుగా ప్రతి బుధవారం, శనివారం ప్రజలు సమస్యల గూర్చి అర్జీలు స్వీకరిస్తూ జనవాణి కార్యక్రమం జరుగుతున్న సంగతి విదితమే జనసేన నాయకులు వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కార మార్గాలను చూపుతున్నారు. నెల్లూరు జిల్లా గోమతి నగర్ కార్యాలయంలో నిర్వహించబడుతున్న జనవాణికి విశేష స్పందన లభిస్తుంది. శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించిన జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణిని ప్రజలందరూ ఉపయేగించుకోవాలని తెలిపారు.



# అంతర్జాతీయ అక్రమ మహిళా రవాణా వ్యతిరేక దినోత్సవం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ అక్రమ మహిళా రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆత్మకూరులో శనివారం పెద్దఎత్తున నిశ్శబ్ద ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆస్ట్రేలియాకు చెందిన అంతర్జాతీయ ఏ21 స్వచ్ఛంద సంస్థ, ముంబైకు చెందిన దిమూామెంట్ ఇండియా సహకారంతో మదనపల్లికి చెందిన గ్రామజ్యోతిసొసైటి సౌజన్యంతో స్తానిక క్రెడ్ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి వాగాల శ్రీహరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మానవ వక్రవాహనంపై నిశ్శబ్ధంగా కేవలం కరపత్రాలతో అధికారులు, మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినిలు తదితరులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఏ21 దిమూామెంట్ ఇండియా సాంకోశి ఎస్తేర్ అన్నకోశివినీత్‌ఫిలో షియాపోల్డన్, గ్రామజ్యోతి సొసైటి ప్రతినిధి బి.సుభద్రల సౌజన్యంతో స్వేచ్ఛ కోసం నడకని బృహత్తర సైలెంట్ హక్కును నిర్వహిస్తున్నామని నిర్వాహకులు వాగాల శ్రీహరి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, సిఐ గంగాధర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, నిర్వాహకుడు వాగాల శ్రీహరి తదితరులు ప్రసంగించారు. ఇది స్వతంత్రం కోసం తాము నడిచే నడక న్యాయం కోసం అని, ప్రతి అడుగులో బానిసత్వం లేని ప్రపంచం సాధ్యమేనని, మానవ అక్రమరవాహా జీవితాలను నాశనం చేస్తున్న స్వేచ్ఛకు అంతిమ గెలుపు ఉంటుందని, ఒక్క అడుగులో అనేకమందిని తాము చూస్తామని, అనేకమంది బాధితులను రక్షింపబడతామని అదే ఆశతో తమవంతుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 21వ శతాబ్ధంలో కూడా బానిసత్వం ఇంకాఉందని, వ్యక్తులు వస్తువులుగా కన్పిస్తున్నారని, విక్రయించబడు తున్నారని వారు పేర్కొన్నారు. ఇంటర్నేషల్ లేబర్ ఆర్గనైజేషన్ 2024 ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 49.6మిలియన్ల మంది ప్రజల అవయవాల దోపిడీ, లైంగికశ్రమ, బలవంతపు వివాహాలు, 150మందిలో ఒకరు బానిసలుగా చిక్కుకొనడం, బాలికలు, మహిళలు లైంగికదోపిడీకి గురవుతున్నారని వారు పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణాలేని సమాజాన్ని చూడాలనకుంటూ అవగాహన కల్పిస్తున్నామని, ఉమెన్ ట్రాకింగ్‌కు గురైన వారు 1098, 181 హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ గంగాధర్, కమీషనర్ గంగాప్రసాద్‌లు నల్లజెండాల ర్యాలీని ప్రారంభించి వారు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రతినిధులకు సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ప్రత్యేకంగా అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినిలు, పలువురు వివిద ప్రజాసంఘాల మహిళలు, క్రెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతిధినిధులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ వ్యవసాయసహాయకులకు శిక్షణ





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం సబ్ డివిజన్‌లోని గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల్లోని విఏఏలకు రానున్న రబీసీజన్‌కు సన్నద్ధత లక్ష్యంగా శిక్షణనిచ్చారు. జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ జి.లక్ష్మిమాధవి మాట్లాడుతూ.. రబీసీజన్‌లో సాగుచేయనున్న వరికి అనువైన విత్తనాల రకాలు, విత్తనశుద్ధి, నారుమడి పెంపకం గురించి వివరించారు. విఏఏలు నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలని, అవసరమైన సూచనలిస్తుండాలని ఆమె సూచించారు. కృషి విజ్ఞానకేంద్రం సబ్జెక్ట్‌మ్యాటర్ స్పెషలిస్ట్ డి.విజయ కుమార్‌నాయక్ మాట్లాడుతూ.. రబీవరిసాగులో ఎద్దుర్కొను పురుగులు, తెగుళ్ళు, సస్యరక్షణ గురించి వివరించారు. జిల్లా ఉద్యానవనాధికారి సీహెచ్ రాజశేఖర్ పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వ రాయితీ పథకాలగురించి వివరించారు. మిరప, నిమ్మ తదితర పంటలసాగు, సస్యరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఏడిఏ వి.దేవసేనమ్మ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు,అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల వ్యవసాయాధికారులు కె.కిషోర్‌బాబు, పి.శ్రీధర్‌రెడ్డి, టి.రజని, డిఆర్‌సి ఏవో బి.శ్రీనివాసచక్రవర్తి, 3మండలాల విఏఏలు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విత్తన దుకాణాలను తనిఖీ చేసిన వ్యవసాయాధికారులు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో ఉన్న వర్షిత సీడ్స్, కావేరి సీడ్స్, ఇందిర సీడ్స్ తదితర వరి విత్తనాలు విక్రయించే దుకాణాలను నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.శ్రీనివాసులు, నెల్లూరు రూరల్ మండల వ్యవసాయాధికారి ఎస్వీ నాగమోహన్ తనిఖీ చేసి దుకాణంలోని విత్తన నాణ్యత రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ మొదలైన వివరాలను, కొనుగోలు చేసిన రైతుల వివరాలు, బిల్ పుస్తకాలు, రసీదులు మొదలైన వివరాలు తనిఖీ చేసినారు. మొలక శాతం 80శాతం కంటే ఎక్కువగా ఉన్న నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రాయించాలని తెలియజేశారు. కొనుగోలు కొరకు వచ్చిన రైతులతో మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదును తీసుకొని జాగ్రత్తగా ఉంచుకోవాలని, విత్తన నాణ్యతలో లోపాలు ఉన్నట్లయితే సరిఅయిన బిల్లుతో స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలియజేశారు. బీపీటీ 5204 రకం సాగుచేయదలచిన రైతులు అక్టోబర్ నెలాకరు లోగ నార్లు పోసుకోవాలని, ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638 సాగుచేయదలచిన రైతులు నవంబరు నెలలో నార్లు పోసుకోవాలని తెలియజేశారు. రైతులు విధిగా మొలక కట్టి సంతృప్తి చెందిన తర్వాత మాత్రమే నార్లు పోసుకోవాలని తెలియజేశారు.

## గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** రెవిన్యూ పరమైన సమస్యలను పరిష్కరించు కునేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కొడవలూరు తహసిల్దార్ స్ఫూర్తి కోరారు. మండలంలోని నాయుడుపాలెంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో చేసిన రీసర్వేలో వచ్చిన సమస్యలపై గ్రామసభ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ గ్రామ సభలను రైతుల సద్వినియోగం చేసుకొని వారి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీలత, రీసర్వే డీటీ అరుణ్ కుమార్, వీఆర్వో సురేష్, విలేజ్ సర్వేయర్, మాగుంట సతీష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్‌ఐను కలిసిన టీడీపీ నాయకులు



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** విడవలూరు మండల ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నరేష్‌ను శనివారం దండిగుంట తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుడుమల మల్లికార్జున, కుడుముల వెంకటస్వామి, పెదకాల ఏసోబు, బిజెపి నాయకులు శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేంద్రలు పాల్గొన్నారు.

## తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం : ఆర్డీఓ పావని



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తుఫాన్ వస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండేలా చర్యలు తీసుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆత్మకూరు ఆర్డీవో బి.పావని పేర్కొన్నారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురవగా డివిజన్‌లోని అన్ని మండలాల్లో పర్యటించానని, ప్రతి రెండుగంటలకు సోమశిల జలాశయంకు వరదనీటి రాక, నీటినిల్వ, విడుదల గురించి తెలుసుకున్నానని, అన్ని మండలాల తహశిల్దార్లు, ఇతర అధికారులు, పోలీసులను అప్రమత్తం చేశామని, పెన్నా పరీవాహక ప్రాంతంలో ఎలాంటి ప్రాణనష్టం, ప్రజలకు ఇబ్బంది లేకుండా అప్రమత్తంగా ఉన్నామని, తీరప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో దాదాపు 45కుటుంబాలకు చెందిన 150మందిని సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించామని, వారికి భోజనం, మందులు సమకూర్చామని పావని పేర్కొన్నారు. చంటి బిడ్డలు, గర్భిణీలు, వృద్ధులపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని ఆమె వెల్లడించారు. కాగా మరో తుఫాన్ అంటూ హెచ్చరికల నేపద్యంలో తాము అన్నీ జాగ్రత్తలకు, ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉన్నామని, ఇప్పటికే అన్నిమండలాల తహశిల్దారులను అప్రమత్తం చేశామని ఆర్డీవో పావని పేర్కొన్నారు.

## కార్యదర్శులకు సన్మానం

**విడవలూరు, మేజర్‌న్యూస్ :** వరిని పంచాయతీకి నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి విజయలక్ష్మికి, బదిలీపై వెళ్లిన కార్యదర్శి సుకన్యకు శనివారం స్థానిక ప్రజా ప్రతినిధులు సన్మానం చేశారు. వారిని పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున రావు మాట్లాడుతూ.. గతంలో కార్యదర్శిగా విధులు నిర్వహించిన సుకన్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భక్తవత్సలయ, వార్డు సభ్యులు, స్థానికులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



# సర్వాంగ సుందరంగా వెంకటేశ్వరస్వామి ఆలయం



## విగ్రహప్రతిష్ఠోత్సవాలు ఆరంభం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం కరటంపాడు మజరా సాతానుపల్లిలో శ్రీ వెంకటేశ్వరస్వామి నూతన ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను శనివారం ఆరంభించారు. అదే గ్రామానికి చెందిన రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు ఆధ్వర్యంలో గ్రామయువత ప్రత్యేక దృష్టి, శ్రద్ధ సారించి వారి ఆధ్వర్యంలో నూతన ఆలయాన్ని నిర్మించారు. అత్యంత సుందరంగా 50లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మించి నూతన విగ్రహాలను కూడా సిద్ధం చేశారు. శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీమహాగణపతి, శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ గరుత్మంతుడు, శిఖరకలశం, శ్రీ శీతలాంబ, నాభిశిల, గమిడి యంత్రముల ప్రతిష్టకు శ్రీకారం చుట్టారు. ఈనెల 21వ తేదీన వేదపండి తుల మంరతోచ్ఛారణలమధ్య కార్యానిర్వాహకుల ఆధ్వర్యంలో విగ్రహాలను ప్రతిష్టించనుండగా ఇందుకు సంబంధించిన కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. శనివారం ఉదయం 6గంటల నుండి పూజా కార్యక్రమాలు, యాగశాల ప్రవేశం, సాయంత్రం 4గంటల నుండి హక్షమములు, విగ్రహజలాధివాసం తదితరు కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 6గంటల నుండి పూజాకార్యక్రమాలు, మహాగణపతిపూజ, విగ్రహముల ధాన్యదివాసం, సాయంత్రం 5గంటలనుండి గ్రామోత్సవం, విగ్రహముల పుష్పాధివాసం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 6గంటల నుండి మహా గణపతిపూజ, యంత్ర ప్రతిష్టలు, ఉదయం 9గంటల నుండి దేవతా మూర్తిల విగ్రహ ప్రతిష్టా మహెూత్సవం జరుగనుంది. ఈ మూడురోజుల పాటు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో విశాలమైన ప్రదేశంలో అత్యంత ఆకర్షిణీయంగా సర్వాంగసుందరంగా ఈ ఆలయాన్ని నిర్మించి విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. భక్తులు విరివిగా ఈకార్యక్రమంలో స్వామి వారి తీర్ధప్రసాదాలు స్వీకరించాలని కార్యనిర్వాహకులు కోరారు.

# పర్యాటక, పారిశ్రామిక రంగంగా అభివృద్ధికి చర్యలు

## నియోజకవర్గానికి రూ.22.60 కోట్ల నిధులు మంజూరు : ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. శనివారం ఉదయగిరి మండలంలోని నేలటూరు పంచాయతీలో 17లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని శకునాలపల్లి జి.చెరువుపల్లి, జి.చెర్లోపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు పూల మాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమం గ్రామ అభివృద్ధి కోసం నిర్వహించిందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా నియోజకవర్గానికి రూ.22.60కోట్ల ఎనర్జీసీ నిధులు గ్రామీణ రోడ్లే కాకుండా తాగునీటి సమస్యలు కూడా ఈ నిధులు ఉపయోగిస్తామన్నారు గ్రామాల్లో గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు నియోజకవర్గంలో 80 కోట్ల మేర అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అన్నారు. పర్యాటక రంగంగా అభివృద్ధి చేసేందుకు డిపిఆర్లు తయారు చేస్తున్నామని, అదేవిధంగా ప్రతి నియోజకవర్గానికి ఇండస్ట్రియల్ పార్కులు తీసుకొని వచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ఐదు సంవత్సరాల వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందని ఆర్థిక వ్యవస్థను నాశనం సర్వనాశనం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. కూటం ప్రభుత్వం తలపెట్టిన పల్లె పండుగ కార్యక్రమాన్ని పల్లెల్లో ఒక పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని సమస్యల పైన దృష్టి సారించి త్వరలోనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామాలను రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే ఏకైక నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బయన్న, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.చింతల్ బాబు యాదవ్, మన్నేటి వెంకటరెడ్డి, నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, గడ్డం శీను, బొజ్జ నర్సింలు, నల్లిపోవు రాజా, గానపెంట ఓబుల్ రెడ్డి, నల్లిపోవు నరసింహ, తాసిల్దార్ సుభద్ర, పిఆర్ ఏఈ శ్రీనివాసరాజు, ఏపీడి గాయత్రి, ఏపీఓ శ్రీనివాసులు, సర్పంచ్ నెల్లూరు వెంకటస్వామి, పెంద్యాల మాధవ్, పెంద్యాల శ్రీను, మేడేపల్లి శ్రీను, పాలగిరి మహేష్, ఏడుకొండలు, మతకాల శ్రీనివాసులు, కప్ప శ్రీనివాసులు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చడమే టీడీపీ లక్ష్యం



**నెల్లూరు/నవాబుపేట, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా క్రీడా ప్రాంగణాలపై శాప్ చైర్మన్ రవి నాయుడు ప్రత్యేక దృష్టి సారించాలి. పూర్తి క్రీడా వసతులతో నెల్లూరు జిల్లాను రాష్ట్రానికే మోడల్‌గా మార్చాలి. బీద రవిచంద్ర యాదవ్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి. క్రీడా మైదానాలు, క్రీడా సౌకర్యాలను పరిశీలించేందుకు నెల్లూరుకు విచ్చేసిన శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ను నెల్లూరు నగరంలోని స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద, చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, జన్ని రమణయ్యలతో కలిసి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సన్మానించి, పుష్ప గుచ్చం అందించారు. ఈ సందర్భంగా బీద మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యం చేసింది. ఆడుదాం ఆంధ్ర పేరిట ప్రచారాలకు, అవినీతికి పరిమితం అయింది. 2014-19 తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం, మొగల్లపాలెంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ మంజూరు అయింది. నాటి కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్యానాయుడు గారి చొరవతో 150 ఎకరాల్లో అవుట్ డోర్, ఇండోర్ ఆటలకు అనుకూలంగా పూర్తి సౌకర్యాలతో ఏర్పాటు చేశారు. తదనంతరం అధికారం లోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్ల పాటు స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను నిర్లక్ష్యం చేసింది. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడా వసతులు దుర్భరంగా వున్నాయి. వర్షం వస్తే ఇండోర్ స్టేడియం తడిచిపోయే దుస్థితి నెలకొంది. శాప్ ఛైర్మన్, అధికారులు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం పై ప్రత్యేక దృష్టి సారించాలి. స్టేడియం ను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వ సాయంతోపాటు పారిశ్రామికవేత్తల సహకారం అవసరం ఉంది. గతంలో జన్మభూమి పేరిట తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ పిలుపులో జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయ్యేవారు. జిల్లా వ్యాప్తంగా క్రీడా ప్రాంగాణాల ఏర్పాటు, అభివృద్ధి కోసం ప్రజలు మరోమారు భాగస్వామ్యం కావాల్సిన తరుణం ఆసన్నమైంది.

## దర్గా సమీపంలో బ్రాందీ షాపును తొలగించండి : గ్రామస్తుల విజ్ఞప్తి

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్‌పేట మండలంలోని హసనాపురం గ్రామంలో బ్రాందీ షాపును దర్గాకు వెళ్లే దారిలో ఏర్పాటు చేశారని, అక్కడనుండి బ్రాందీ షాపును తొలగించాలని హసనాపురం గ్రామ ముస్లిం సోదరులు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల హసనాపురం గ్రామానికి బ్రాందీ షాపు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అయితే గ్రామంలోని కొండ పోరంబోకు దారిని కొంత స్థలాన్ని ఆక్రమించి బ్రాందీ షాపును ఏర్పాటు చేయడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే బ్రాందీ షాపు సమీపంలోనే బంగారమ్మ దేవర ఇంటి నివాసాల మధ్యలో దర్గాకు వెళ్లే దారిలో బ్రాందీ షాపును తొలగించాలని కోరుతున్నారు. గ్రామంలోని దర్గాకు భక్తులు మహిళలు వస్తుంటారని దారిలో బ్రాందీ షాపు ఏర్పాటు చేయడం తగదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి బ్రాందీ షాపును అక్కడనుండి మరొక చోటకి మార్చాలని గ్రామస్తులు ముస్లిం సోదరులు కోరుతున్నారు.

## ఇళ్లల్లోకి ప్రవేశించిన వర్షపు నీరు





**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులో శనివారం 8 సెంటీమీటర్ల పైగా వర్ష పాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమై కొన్నిచోట్ల ఇళ్ళళ్ళోకి నీళ్ళు వచ్చి చేరింది స్థానిక గంగమిట్ట కమ్మ బజారు, జీబికేఆర్, గిరిజన కాలనీ, బీసి కాలనీ , సుజాతనగర్, లక్ష్మీ ప్రియా, దేవతా మహల్ కూడళ్ళ వద్ద సిద్దార్థ నగర్ వినాయకనగర్ లల్లో ఇల్లల్లోకి నీళ్ళు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇల్లలోకి నీళ్ళు వచ్చాయి అదికారులు ప్రజాప్రతినిదులు నాలుగు జెసిబిలు తెప్పించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. దీంతో నీరు సాగిపోయింది. పలు చోట్ల నీరు పారే సదుపాయం లేక నీరు ఇళ్ళలోకి ప్రవేశించాయి. ఉదయగిరి శాసనసభ్యులు కాకర్లసురేశ్ బీసీ కాలనీ జిబి కేఆర్ గిరిజన కాలనీలలో పర్యటించారు జీబీ కెఆర్ గిరిజన కాలనీలో మధ్యాహ్నం కాలనీ వాసులకు భోజున సదుపాయం కల్పించారు. తహసీల్దార్ హామీద్ సర్పంచి ఎన్ సుజనా సిబ్బందితో వెళ్ళి సహాయక చర్యలు చేపట్టారు పంట పొలాలు నీట మునిగాయి. పలుచోట్ల రైతులు పొలల్లో నిలిచి వున్న నీటిని కాలువలు చేసి బయటకు వెళ్ళేలా చర్యలు చేపట్టారు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది అని వార్తలు వస్తూ వుండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## టీటీడీకి 1000 గోవులు ఏర్పాటు చేస్తాం

### పట్టించుకోని ప్రభుత్వం : బీసీవై నాయకులు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వాన్నిసూటిగా ప్రస్నిస్తున బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ తిరుమల పరిరక్షణ లడ్డు ప్రసాదాలకు ఉపయోగించే నెయ్యిపై జరిగిన ప్రచారాలు తెర దించుతూతన వంతుగా ఉచితంగా 1000 గోవులు ప్రకటించారు. లక్ష గోవులును ఉచితంగా సమకూర్చే భాద్యత, పదివేలమందికి ఉపాధి కలిగించే భాద్యత తీసుకుంటాను అనిప్రకటించారు కానీ కూటమి ప్రభుత్వం కాని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ విధమైన వనరులు ఉన్న టీటీడీ దిశగా ఆలోచించకపోవడం శోచనీయం ప్రపంచం వ్యాప్తంగా ఉన్న కలియుగ దైవం అయిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి భక్తుల మనోభవాల తో ముడిపడి ఉన్న ఈ సమస్యకు శాస్వత పరిస్కారం చేసే విదంగా శ్రీ రామచంద్ర యాదవ్ అన్న చూపిన చొరవ అభినందనీయం కానీ ఈ రాష్ట కూటమి ప్రభుత్వం తక్షణమే రామచంద్ర యాదవ్ చూచించిన సూచనలను పరిగణనలోకి తీసుకుని తీసుకుని టీటీడీకి నెయ్యి కోసం సాశ్వతం పరిస్కారం చేస్తారని ఈ కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్కా దినేష్, సోమా గోపాల్, మహేష్ వర్మ, రామ్మోహన్, హరి, కార్తీక్ మొదలగు పెద్దలు పత్రికా సమావేశంలో పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధి, భావి తరాల ప్రయోజనాల కోసం

# శక్తివంచన లేకుండా కృషి చేస్తా : మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి, భావితరాల ప్రయోజనానికి ప్రత్యేక శ్రద్దతో కృషి చేస్తానని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో అనంతసాగరం మండల పార్టీ నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రసంగించారు. భారీగా అనంతసాగరం మండల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ప్రతిఒక్కరిని పేరుపేరున ఆప్యాయంగా మంత్రి పలకరించారు. అనంతసాగరం మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సభ్యత్వ నమోదుపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాల మేరకు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని మంత్రి ఆనం పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం మే 27 నాటికి ఆత్మకూరులో శాశ్వతంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి జరుగుతుందని మంత్రి ఆనం పేర్కొన్నారు. కంప్యూటర్లు, అర్జీల నమోదు, డేటా ఎంట్రీ, అర్జీల స్టేటస్, పూర్తిస్థాయిలో జవాబుదారీతనం ఉండేలా కార్పొరేట్ స్థాయిలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రతి సోమవారం నియోజకవర్గ పరిధిలోని ఏదైనా ఒక మండల కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తాను కూడా పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సత్వరమే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆనం తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్త కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని ఆయన సూచించారు. రెండేళ్ల పార్టీ సభ్యత్వానికి 100 రూపాయలు ఆన్లైన్లోనే చెల్లించాలని, సభ్యత్వం చెల్లించిన ప్రతి ఒక్క కార్యకర్త సంక్షేమానికి పార్టీ కృషి చేస్తోందని మంత్రి ఆనం పేర్కొన్నారు. యువత పెద్దఎత్తున రాజకీయాల్లోకి రావాలని మంత్రి కోరారు. ఏ నియోజకవర్గంలో లేనివిధంగా సోమశిల జలాశయం, హైలెవల్ కెనాల్, ఉత్తర కాలువ, సంగం బ్యారేజీ వంటి సాగునీటి ప్రాజెక్టులు, మూడు జాతీయ రహదారులు, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ వంటి మౌలిక వనరులు మెండుగా ఆత్మకూరుకు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకుని ఆత్మకూరు అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రాబోయే ఐదేళ్లలో పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల ఏర్పాటు, వివిధ రెసిడెన్షియల్ కళాశాలల ఏర్పాటు, స్కిల్ కళాశాల ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నానని మంత్రి ఆనం తెలిపారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులు, ఇరిగేషన్ పనులను మొదలుపెట్టనున్నామని నాయకులందరూ గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులను సూచించాలని ఆయన కోరారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సరికొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారని, పారదర్శకంగా టెండర్ల ద్వారా లాటరీ పద్ధతిలో మద్యం షాపులను కేటాయించామన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా సరికొత్త మద్యం పాలసీని తీసుకొచ్చి పేదవాడి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన అన్ని బ్రాండ్ల మద్యాన్ని క్వార్టర్ బాటిల్ రూ.99కే అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రాష్ట్రంలోని యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి ఇండస్ట్రియల్ పాలసీని ప్రవేశపెట్టారని, ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు ఉన్నవారు వ్యక్తిగత అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చునని, ఏ అధికారి కూడా అడ్డుకోరని, ఎవరైనా అడ్డుకుంటే వారిని సస్పెండ్ చేస్తామని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని మంత్రి ఆనం వివరించారు. ఆత్మకూరు అభివృద్ధితోపాటు జిల్లా సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఆనం పేర్కొన్నారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో కూడా కార్యకర్తలు అందరూ భాగస్వామ్యం కావాలని మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మెటుకూరు ధనుంజయ రెడ్డి, అనంతసాగరం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అవగాహన లేకపోతే జీవితాంతం వికలాంగులే



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఎముకలు గుల్లబారడం (ఆస్టియోపోరోసిస్) వ్యాధిపై అవగాహన పెంచుకోకపోతే జీవితాంతం వికలాంగులుగా మారే ప్రమాదం ఉందని నెల్లూరులోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బీఎల్‌ఎస్ కుమార్ బాబు, సీనియర్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్ డాక్టర్ కె.శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీన ప్రపంచ ఆస్టియోపోరోసిస్ దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎముకల్లో చేవ తగ్గిపోయి, ధృఢత్వం కోల్పోయి, బోలుగా మారడాన్ని ఆస్టియోపోరోసిస్ అని అంటారని తెలిపారు. ఈ వ్యాధిని

## ఆస్టియోపోరోసిస్ పై మెడికవర్ అవగాహన

నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం వికలాంగులుగా మారే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకే ప్రతీ ఏటా అక్టోబర్ 20వ తేదీన ప్రపంచ ఆస్టియోపోరోసిస్ దినోత్సవంగా జరుపుకుంటారని వివరించారు. ఈ వ్యాధి ఎలాంటి ముందస్తు లక్షణాలు లేకుండా అటాక్ చేస్తుందని, 50 ఏళ్లు పైబడిన ప్రతీ ముగ్గురిలో ఒకరు, ప్రతీ ఐదు మంది పురుషుల్లో ఒకరు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు గణంకాలు చెబుతున్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ వ్యాధి బారిన పడిన వారిలో ఎముకలు ధృడత్వాన్ని కోల్పోవడంతోపాటు ఎదగవని, ఆస్టియోపోరోసిస్ వ్యాధి బారిన పడిన వారికి ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించవని, వ్యాధి తీవ్రత పెరిగి ఎదైనా ఎముక విరిగినప్పుడు మాత్రమే తెలుస్తుంది పేర్కొన్నారు. వయసుతో పాటు ఈ వ్యాధి సంక్రమించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఎముకల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడంతోనే ఈ వ్యాధికి అడ్డుకట్ట వేయొచ్చన్నారు. ఈ వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం, ముందస్తు లక్షణాలు కనిపించకపోవడంతో కేవలం 20 శాతం మంది మాత్రమే ప్రతీ ఏటా ఈ వ్యాధికి చికిత్స పొందుతున్నారని డాక్టర్ కుమార్ బాబు, డాక్టర్ శశిధర్ రెడ్డి తెలియజేశారు. మోనోపాజ్ దశకు చేరుకున్న మహిళల్లో ఈ వ్యాధి ఎక్కువగా



కనిపిస్తుందని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఎముకలు, కండరాలు ఆరోగ్యంగా ఉంటాయని వెల్లడించారు. వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా కాల్షియం, విటమిన్ డి, ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అలాగే మద్యపానం, దూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కుటుంబంలో ఇంతకు ముందు ఈ వ్యాధి ఎవరికైనా ఉండి ఉంటే ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని, ఈ వ్యాధిని ముందుగా గుర్తిస్తే దాన్ని నివారించడం సులువు అని వైద్యులు తెలియజేశారు.

సూర్య www.suryaa.com
రిపోర్టర్స్ కావలెను



తెలుగు పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దిన పత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకుల కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని అల్లూరు, దగదర్తి, దుత్తలూరు, కొండాపురం, చేజర్ల, మనుబోలు, కొడవలూరు, బుచ్చి, కోవూరులలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

సూర్య కార్యాలయం, మిలిటరీ కాలనీ, రోడ్ నెం.1,
LIC & CID ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు.
సెల్: 9000 118811, 9966 49 71 49

## స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ని సందర్శించిన శాప్ చైర్మన్



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మొగళ్లపాలెం స్పోర్ట్స్ కాంప్లెక్స్, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియాలను సందర్శించేందుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడుని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శాలువాతో సత్కరించి, ఘన స్వాగతం పలికారు. అనంతరం మొగళ్లపాలెం స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియాలను సందర్శించారు. సమస్యలన్నీ ప్రత్యక్షంగా చూసాం, వీలైనంత త్వరలో సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు నా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. క్రీడాకారులకు అందరికీ ఎంతో ఉపయోగపడే మొగళ్లపాలెం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పూర్తి స్థాయిలో క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నందు ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ప్రత్యక్షంగా వచ్చి సందర్శించినందుకు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, 27వ డివిజన్ కార్పొరేటర్ భీమినేని మురహరి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులను కలిసిన మాలేపాటి



**కావలి, మేజర్‌న్యూస్ :** మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు రాష్ట్ర మైన్స్, జియాలజీ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయ పరిస్థితులు గురించి చర్చించుకున్నారు వీరితోపాటు టీడీపీ నాయకులు కంచర్ల కృష్ణ కూడా ఉన్నారు.

## నేడు రూరల్‌లో బీజేపీ కార్యాలయం ప్రారంభం

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో నీ కొత్తూరు లో బీజేపీ కార్యాలయంను స్థానిక నాయకులు కార్యకర్తలు ఏర్పాటు చేశారు. నేడు 20తేది ఆదివారం ఉదయం పదిగంటలకు లంచానంగా ప్రారంభం కానుంది. ఈ ప్రారంభ కార్యక్రమంకు ఆ పార్టీ ముఖ్యనేతలు వంశీధర్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, సురేష్ రెడ్డి, మిడతల రమేష్, మండ్ల ఈశ్వరయ్య తదితరులు పాల్గొంటారని తెలిసింది.